# స్ఫూర్తి ప్రదాత

రచన: సీర సంగీత శ్రీ

తరగతి గదిలో సామాన్య శాస్త్రం బోధిస్తున్నారు ఉపాధ్యాయుడు సుధాకర్. అన్య మనస్కంగా తన స్టూడెంట్ మానసని గమనిస్తూ పాఠాన్ని చెప్తూ ఉన్నాడు. పాఠం చెప్పడం అయిపోయిన తరువాత అందర్నీ తను చెప్పిన పాఠంలో నుంచి ప్రశ్నలు అడుగుతున్నాడు. అయినా అమ్మాయి అలాగే ఏదో ఆలోచనలో ఉన్నట్టుగా కనబడుతుంది. తన వంకే చూస్తుంది కానీ తన ఆలోచనలు ఎక్కడో ఉన్నాయి? ఏమిటో కనుక్కోవాలి. నేను చెప్పిన పాఠం మానస వినలేదు అని నాకు అర్థం అవుతుంది ఇప్పుడు లేపి తనని ప్రశ్నించి అందరి ముందు తను అవమానపడడం సుధాకర్ సార్ కి ఇష్టం లేదు.

అందుకనే బెల్ అవ్వగానే "మానసా, ఇలారా" అంటూ పిలిచారు.

మానస వెళ్లి చేతులు కట్టుకొని నిలబడింది.

"ఈ బుక్స్ కాస్త స్టాఫ్ రూమ్ లోకి తీసుకురామ్మా" అన్నారు.

ఎప్పుడూ వేరే వాళ్లకు సార్ పని చెప్తాడు ఈరోజు మానసని తీసుకురమ్మని చెప్పారు.

పిల్లలు ఒక్క క్షణం ఆలోచించారు "ఎందుకు సర్ తనని తీసుకురమ్మన్నారు అని. మళ్లీ అంతలోనే సరేలే సుధాకర్ సార్ కి ఎవరి పేరు నోటికొస్తే వాళ్లకే చెపుతారు కదా "అనుకొని తమ మాటల్లో మునిగిపోయారు విద్యార్థులు.

పుస్తకాలు తీసుకొని సారుని అనుసరించింది మానస .తనతో సమానంగా నడుస్తూ "మానసా, ఏమైందిరా? నేను పాఠం చెప్పడం మొదలుపెట్టినప్పటి నుంచి నిన్ను గమనిస్తున్నాను. నీవు ఎక్కడో ఆలోచిస్తున్నావ్, ఏమైంది? ఇంట్లో ఏమైనా ప్రాబ్లమా?" అని అడిగారు.

దానికి జవాబుగా "లేదు సార్, ఇంట్లో అంతా బాగానే ఉంది. మీకు తెలుసు కదా! అన్న, అమ్మానాన్న, అక్క ఏమీ అనరు. నాకు ఇంకా చదువులో వాళ్ళు సహాయం కూడా చేస్తారు .అమ్మ ఇంటి పనులు కూడా ఏమి చెప్పదు. అక్క, అన్నయ్య అమ్మకు సహాయం చేస్తారు. " అన్నది మానస "అవును, మరి ఎందుకని అలా ఉన్నావు?

"సార్, నాకు ఎంత చదివినా తెలుగు పద్యాలు కంఠస్థం రావడం లేదు. అసలు స్నేహితులందరూ బాగా నేర్చుకొని గడగడ చది వేస్తున్నారు. తెలుగు సార్ కోప్పడుతుంటే నాకు చాలా బాధగా అనిపిస్తుంది. నేను ఎంతో చదువుతున్నాను. అక్క అన్నయ్య కూడా సహాయం చేస్తున్నారు కానీ నాకు గుర్తుండడం లేదు. నేను ఎలాగైనా నేర్చుకోవాలి .మనసులో పద్యాన్ని నెమరు వేసుకుంటున్నాను. సారీ సార్, మీ మాట వినకుండా నేను వేరే సబ్జెక్టు చదువుతున్నాను మనసులో" అంది గిల్టీగా.

"పర్వాలేదు మానసా, సరే నువ్వు బుక్స్ పెట్టేసి రా. చెప్తాను" అన్నారు సుధాకర్ సార్. మానస స్టాఫ్ రూమ్ లో బుక్స్ పెట్టేసి బయటకు వచ్చింది.

"నువ్వు క్లాస్ రూమ్ కి వెళ్లి తెలుగు బుక్ పట్టుకొని రా" అన్నారు. అలాగే వెళ్లి తెలుగు బుక్ తీసుకొని బయటకు వెళ్ళింది. సార్ చెట్టు కింద కూర్చున్నారు. ఏ పద్యం చెప్పు అంటే చూపెట్టింది.

"నేను చెప్తాను నా వెనకాల నువ్వు కూడా చెప్పు అని అన్నారు సార్ . సర్ చెప్తుంటే ఆశ్చర్యపోతూ సార్ ను అనుసరించింది మానస.

"సార్, మీకు తెలుగు వచ్చా? అని అడిగింది నవ్వుతూ.

" అదేం ప్రశ్న ,మన మాతృభాష మనకి బాగా వస్తుంది. మన మాతృభాష తెలుగే కదా. నేను తెలుగు బాగా నేర్చుకున్నాను. తెలుగులో నుండే కదా మన మిగతా సభ్యులు నేర్చుకునేది. మనకి హిందీ ఇంగ్లీష్ రాకపోతే కాస్త గాభరా పడాలి .దాని మీద ఎక్కువ శ్రద్ధ పెట్టాలి కానీ తెలుగు రాకపోతే ఎందుకు బాధపడడం? తెలుగు తప్పకుండా వస్తుంది. ఫస్ట్ నువ్వు ఆ పద్యాలకి అర్థం, వివరణ తెలుసుకో "అంటూ చక్కగా అర్థం అయ్యేలా చెప్పారు సార్. నాకు ఇప్పుడు వచ్చినట్టు అనిపిస్తుంది ఒకసారి చెప్తాను చూడండి అంటూ అప్పజెప్పేసింది మానస.

సార్ చాలా మెచ్చుకున్నారు ."చూడమ్మా, మనము చదివే విషయం మీద శ్రద్ధ ఉండాలి. పట్టుదలగా చదివితే దేనినైనా సాధించగలం. నువ్వు మనసుపెట్టి చదువు" అన్నారు.

అప్పటినుంచి వేరే సబ్జెక్టులలో ఏ అనుమానం వచ్చినా తెలుగుతో పాటు సార్ దగ్గరికి వెళ్లి చెప్పించుకోవడం నేర్చుకోవడం చేసింది మానస.అలా సంవత్సరాలు దొర్లిపోయాయి. ఇప్పుడు మానస తెలుగు ప్రొఫెసర్ గా ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యోగం చేస్తుంది.

ఉస్మానియా యూనివర్సిటీలో జరుగుతున్న తెలుగు సెమినార్ లో మానస అనర్గళంగా ఉపన్యాసం ఇస్తుంది. శ్రోతలని ఆకర్షించుకుంటూ, తన వాగ్ధాటితో మంత్రముగ్ధుల్ని చేస్తూ,వాళ్లు తన ఉపన్యాసం ఇంకా కొనసాగాలని ఉత్సాహపడేలా ప్రసంగిస్తూ, తన ప్రసంగంలో తను ఈరోజు ఈ స్థితిలో ఉండటానికి తనకి స్ఫూర్తి ప్రదాత తన సామాన్య శాస్త్ర బోధకుడు సుధాకర్ సార్ అంటూ చాలా వినయంగా గౌరవపూర్వకంగా చెప్పి సార్ కి మనస్ఫూర్తిగా సాష్టాంగ పాదాభివందనం చేస్తున్నాను" అన్నది మానస.

తను ఆ మహనీయున్ని ఆదర్శంగా తీసుకొని అతని బాటలోనే పయనిస్తున్నానని చెప్తూ తన ఉపన్యాసాన్ని ముగించింది మానస.

ఆ సెమినార్ కి వచ్చిన సుధాకర్ సార్ సభా వేదిక పైకి రావడం చూసి ఆశ్చర్యపోయింది మానస. ఎదురుగా వెళ్లి సార్ కి పాదాభివందనం చేసింది. సార్ మైకు తీసుకొని "మానస నన్ను చాలా గొప్పవాడిగా ఆకాశానికి ఎత్తేసి మాట్లాడుతుంది కానీ నేనేమంత గొప్పవాణ్ణి కాదు. నేను కేవలం మార్గదర్శకం మాత్రమే చేశాను. తను ఈ స్థాయికి చేరుకోవడం వెనకాల తన పట్టుదల, కృషి ,నిరంతర సాధనమే కారణం.

నా శిష్యురాలు ఇంత ఉన్నత స్థాయికి ఎదగడం నాకు చాలా గర్వంగా ఉంది. నేను మానసని మనసారా అభినందిస్తున్నాను. తనని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులంతా ఎదగాలని "తన ఉపన్యాసాన్ని ముగించారు.

ఆ సభాస్థలి అంతా చప్పట్లతో మారుమోగింది.

